క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన

సుండుపల్లె : మండల కేంద్రంలోని శ్రీ ఆరెమ్మ దేవాలయం సన్నిధిలో శ్రీ వేంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రపురెడ్డి ఆరంరెడ్డి ఏర్పాటు చేయించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, 20 మందికి ఆపరేషన్లు చేశారు. అనంతరం సర్పంచ్ రామ జయచంద్ర మాట్లాడుతూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

స్టడీ మెటీరియల్స్ వితరణ

పుల్లంపేట : స్థానిక టి.కమ్మపల్లిలోని గ్రంథాలయానికి ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉపయోగపడే సుమారు రూ. 5 వేలు విలువగల స్టడీ మెటీరియల్స్‌ను టి.కమ్మపల్లికి చెందిన ఎం.సుబ్బరాయుడు గ్రంథాలయ నిర్వాహకుడు శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను ఉచితంగా అందించడం మంచి పరిణామమన్నారు. విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాలనరసింహులు పాల్గొన్నారు. అనంతరం స్టడీ మెటీరియల్స్ అందజేసిన దాతను ఉపాధ్యాయులు అభినందించారు.

చెత్త బుట్టల పంపిణీ

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామ పంచాయతీ బీసీ కాలనీ మహిళలకు చెత్త బుట్టలు పంపిణీ చేశామని గ్రామ పంచాయతీ కార్యదర్శి శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలోని బీసీ కాలనీలో 25 మంది మహిళలకు చెత్త బుట్టలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నాగమునిరెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, మహిళలు పాల్గొన్నారు.

రాయచోటి సబ్ జైల్ తనిఖీ



జైల్ పరిసరాలను పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫకృద్దీన్

రాయచోటి టౌన్ : రాయచోటి సబ్ జైల్‌ను జిల్లా సేవాధికార సంస్థ జిల్లా సెక్రటరీ, న్యాయమూర్తి ఎస్.బాబా ఫకృద్దీన్ తనిఖీ చేశారు. బుధవారం రాత్రి ఆయన జైల్‌కు వచ్చి జైల్లో నిందితులుగా ఉన్న వారితో మాట్లాడారు. వారికి లీగల్ ఎయిడ్ ప్రాధాన్యతను వివరించి చెప్పారు. జైల్లో ఉన్న ఖైదీలకు గల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై అవగాహన కల్పించారు. జైల్లో ఏవైనా సమస్యలు ఉంటే రాయచోటి మండల న్యాయ సమితిని, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పక్కాగా అమలవ్వాలి



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నందలూరు : మండలంలోని టంగుటూరు ఇసుక రీచ్‌ను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన టంగుటూరు ఇసుక రీచ్‌కు సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఇసుక రీచ్ నుంచి రోజువారి ఎంత ఇసుకను తరలిస్తున్నారు, ఎవరెవరు తీసుకెళ్తున్నారు వంటి వివిధ ప్రశ్నలకు ఇసుక రీచ్‌ను నిర్వహించే అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక పాలసీ మన జిల్లాలో పక్కాగా అమలవ్వాలని, ఇందులో ఎటువంటి అవకతవకలకు తావివ్వరాదని అధికారులను ఆదేశించారు.

కోడూరులో ప్రభాస్ పుట్టినరోజు వేడుక



ప్రభాస్ పుట్టినరోజు కేక్ కట్ చేస్తున్న అభిమానులు, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకొని అభిమానులు బుధవారం పెద్దఎత్తున వేడుకలు నిర్వహించారు. స్థానిక టోల్‌గేట్ వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ఎత్తున బాణసంచా పేలుస్తూ యువకులు, అభిమానులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరాజు, రవికుమార్‌రాజు, జయప్రకాష్ నారాయణవర్మ, మునిరాజు, శ్రీనివాసరాజు, సతీష్‌రాజు, అభిమాన సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మారని పరిస్థితి.. ఏంటీ దుస్థితి?

- ఇష్టానుసారంగా రాయచోటి – వేంపల్లె బస్సు సర్వీసులు
- ఒకే సమయంలో వస్తున్న 3 – 4 బస్సులు
- మిగతా సమయంలో గంటల కొద్ది వేచి ఉండలేక ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం
- సమస్యను రవాణా మంత్రి మండిపల్లికి తెలియజేసిన పట్టించుకోని అధికారులు



లక్కిరెడ్డిపల్లె బస్టాప్ వద్దకు ఒకేసారి నాలుగు బస్సులు రావడంతో ప్రయాణికుల కోసం వేచివున్న బస్సు

లక్కిరెడ్డిపల్లి : రోజూ వందలాది మంది ప్రయాణికులు అటు రాయచోటికి, ఇటు వేంపల్లికి వెళ్తూ ఉంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఆర్టీసీ వారు అరకొర బస్సులు నడుపుతూ చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలు చేరుకునేందుకు వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తోంది. రాయచోటి – వేంపల్లి రోడ్డు మార్గంలో నిత్యం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినీ విద్యార్థులతోపాటు వ్యాపారస్తులు వేకువజాము మొదలుకొని రాత్రి 10 గంటల వరకు వారి ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉంటారు. సరైన సమయానికి బస్సులు రాక.. వేచి ఉండలేక ప్రయాణికులు ఆటోలు, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్డు మార్గంలో ద్విచక్రవాహనదారులతోపాటు ఆటోలో ప్రయాణం చేసిన వారు చాలా మంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఆర్టీసీ వారు నడుపుతున్న బస్సులు వరుస క్రమంలో ఒకేసారి మూడు, నాలుగు బస్సులు వెళ్లడం, తిరిగి వచ్చేటప్పుడు ఒకేసారి మూడు, నాలుగు బస్సులు రావడంతో గంటల కొద్దీ రోడ్లపై ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తుందని పలువురు ప్రయాణికులు, విద్యార్థులు వాపోతున్నారు. అదనంగా రాయచోటి – వేంపల్లి రోడ్డు మార్గాన మరిన్ని బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని పలుమార్లు ఆర్టీసీ సిబ్బందికి సూచించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాయచోటి ఆర్టీసీ డీఎంకు మంత్రి ఆదేశాలు జారీ చేసినా మునుపటిలా పరిస్థితి కొనసాగుతుండటంపై పలువురు ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఒకే సమయంలో మూడు, నాలుగు బస్సులు నడపకుండా అరగంట లేదా గంటకు ఒక బస్సును మండల కేంద్రం గుండా వెళ్లేలా చూస్తే ప్రయాణికులు, విద్యార్థులు రైతులకు మేలు చేసిన వారవుతారని కోరుతున్నారు.

బస్సులన్నీ ఒకేసారి వెళ్తాయి



రాయచోటి – వేంపల్లి మార్గంలో రోజూ ఉదయం మొదలుకొని రాత్రి వరకు ఆర్టీసీ బస్సులు వరుసగా ఒకేసారి మూడు, నాలుగు బస్సులు వస్తున్నాయి. తరువాత గంటల కొద్దీ రోడ్డుపై వేచి చూడాలి. లేదంటే ఆటోలు, జీపులు ఎక్కి వెళ్లాలి. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆటోలు, జీపుల ప్రయాణం సురక్షితం కాదని తెలిసినప్పటికీ వెళ్లక తప్పలేదు. ఆర్టీసీ వారు చొరవచూపి సమయపాలన పాటించి బస్సులు నడిపితే ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవు.

– ఎలమంద ప్రదీప్, ప్రయాణికుడు, మర్రిచెట్టు, లక్కిరెడ్డిపల్లి మండలం

మరిన్ని బస్సులు నడపాలి



రాయచోటి నుంచి వేంపల్లెకు మరిన్ని బస్సులు నడపాలి. బస్సుల కోసం గంటలకొద్ది నిలబడాల్సి వస్తుంది. బస్సులు రాక ఆటోలకు వందల రూపాయలు ఇచ్చి గమ్యానికి చేరుకోవాల్సి వస్తోంది. ఆర్టీసీ వారు ఎక్కువ బస్సులు వేసి ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రజాప్రతినిధులు పట్టించుకుని ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలి. ఆటోలలో జీపులలో ప్రయాణం చేయాలంటే భయం వేస్తుంది.

– హుస్సేన్ బీ, కోనంపేట, లక్కిరెడ్డిపల్లి మండలం

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

రాజంపేట టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యులు, వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని పలువార్డుల్లో ఆయన కలియ తిరిగి వైద్యం ఎలా అందుతుంది, వైద్యులు నిత్యం వచ్చి చూస్తున్నారా అన్న విషయాలపై ఎమ్మెల్యే రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడున్న వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమై ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారంతా పేదలేనని, వారికి వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఉన్న కంటి పరీక్షల కేంద్రాన్ని తీసేశారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఇంతకంటే దుర్మార్గమైన విషయం మరొకటి ఉండదన్నారు. వయస్సు పైబడే కొద్దీ కంటిచూపు సమస్యలు వస్తాయని, అందువల్ల జగన్ తన ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కంటివైద్య కేంద్రం ఏర్పాటు చేయించి ఉచితంగా అద్దాలు ఇచ్చేవారన్నారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడం బాధకలిగిస్తోందని ఆకేపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు దాసరి పెంచలయ్య, జీవీ.సుబ్బరాజు, మలిశెట్టి శ్రీనివాసులుగౌడ్, హరి తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్ తలుపులు తెరిసేదెప్పుడో?



సిద్దవటం మట్లిరాజుల కోటలో ఎప్పుడూ తెరుచుకోని మరుగుదొడ్లు

సిద్దవటం : పర్యాటకుల సౌకర్యార్థం పురాతత్వ సర్వేక్షణ శాఖ వారు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు ఎప్పుడు తెరుచుకుంటాయో తెలియని పరిస్థితి నెలకొందని కోట సందర్శనకు వచ్చే పర్యాటకులు వాపోతున్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లిరాజుల కోట ముఖద్వారం వద్ద సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల కోసం పురాతత్వ సర్వేక్షణాధికారులు మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ఎప్పుడు తాళం వేసే ఉంటారు. ఎప్పుడు తెరుస్తారో కూడా తెలియదు. అలాంటప్పుడు పేరుకే మరుగుదొడ్లు ఏర్పాటు చేశారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు, మరుగుదొడ్లు తెరిచి ఉంచేందుకు సిబ్బందిని పురావస్తు శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే మరుగుదొడ్లు ఎప్పుడూ మూసి ఉంటే అక్కడ పనిచేసే సిబ్బందికి జీతాలు ఎందుకు చెల్లిస్తున్నారని బుధవారం కోటకు వచ్చిన పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



రైల్వేకోడూరు అర్బన్ : మాట్లాడుతున్న రాజశేఖర్




మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం వలంటీర్లను విధులలోకి తీసుకొని ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేలు జీతం ఇవ్వాలని బుధవారం సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో వలంటీర్లను కొనసాగించి వారికి 10 వేలు జీతం ఇస్తామన్న సంగతి గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు వలంటీర్లను పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన వలంటీర్ల వ్యవస్థ పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. పథకాలు ప్రజలకు నేరుగా చేరవేశారని తెలిపారు. కరోనా సమయంలో వారి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కేవలం వైఎస్సార్సీపీ ప్రభుత్వం వారిని తీసుకున్నారన్న దురుద్దేశంతో వారిని పక్కన పెట్టడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. వారిని విధులలోకి తీసుకొని గడిచిన నాలుగు నెలల జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెట్టిపల్లి పెంచలయ్య, మొగిలి వినయ్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో డీహెచ్‌పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు చుక్క వీరభద్రయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు పూర్తి కావస్తున్న వలంటీర్ల వ్యవస్థ ను కొనసాగించడానికి అవసరమైన ప్రక్రియను ప్రారంభించకపోవడం దారుణమన్నారు. వలంటీర్లను కొనసాగించకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి కార్యకర్తలు గాలివీటి రామాంజనేయులు, ప్రసన్నాంజనేయులు, హరినాథ, సురేష్ బాబు ఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల వసతులు అందజేయాలి



సమస్యలపై ఆరా తీస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

చిన్నమండెం : హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం చిన్నమండెంలోని ఎస్‌డబ్ల్యూఎస్ బాలుర హాస్టల్‌ను జిల్లా అదనపు అదనపు జిల్లా జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి పరిశీలించారు. హాస్టల్ విద్యార్థుల తరగతి గదులతోపాటు నిద్రించే గదులు, వంట గదులు, స్టోర్ రూమ్, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల వసతులను అందజేయాలని వసతి గృహ సంక్షేమ అధికారులకు సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

రామాపురం : మండల పరిధిలోని నీలకంఠ్రావుపేట గ్రామంలో గురువారం కడపకు చెందిన కింగ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అయూబ్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులు, సంతానంలేని వారికి పరీక్షలు, స్త్రీలకు సంబంధించిన సమస్యలు, గర్భిణులకు, విషజ్వరాలు, షుగర్, బీపీ, థైరాయిడ్, గ్యాస్ట్రబుల్ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

ఉచిత సైనిక్ నమూనా పరీక్ష

రాయచోటి (జగదాంబసెంటర్) : నవంబర్ 3వ తేదీన రాయచోటి పట్టణంలో పూసపాటి సైనిక్ నమూనా పరీక్ష నిర్వహించబోతున్నట్లు సంస్థ నిర్వాహకులు పూసపాటి రెడ్డిశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతూ 2025 సంవత్సరం సైనిక్ పరీక్షకు హాజరయ్యే వారు ఈ నమూనా పరీక్షకు హాజరుకావచ్చన్నారు. ఈ నమూనా పరీక్షకు హాజరైతే విద్యార్థులు తమ సామర్థ్యాలను పరీక్షించుకోవచ్చని లోపాలు ఉంటే సరిదిద్దుకోవచ్చని చెప్పారు. పరీక్ష పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తామని తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు అక్టోబర్ 30లోపు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. వివరాలకు 96666 85195, 94400 10134 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఘన నివాళి

రామాపురం : నల్లగుట్టపల్లె విశ్రాంత వీఆర్‌ఓ అయోధ్యపురం ధర్మారెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి ప్రసాద్‌రెడ్డి మాతృమూర్తి అయోధ్యపురం సుబ్బలక్షుమమ్మ మృతదేహాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, చిన్నారెడ్డి, రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, ఆంజనేయులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

బాత్రూమ్ సామగ్రి పంపిణీ

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల బాత్రూమ్‌లకు సంబంధించిన సామగ్రిని ఎంఈఓ వెంటసుబ్బయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సామగ్రిని ప్రతి పాఠశాల సద్వినియోగం చేసుకోని పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు మల్లికార్జున, బాబా ఫకృద్దీన్, చంద్రకళ, కళావతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఎక్సైజ్ కార్యాలయ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిమూలం శ్రీనివాసులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు శ్రీనివాసులు అనంతపురం గొల్లపల్లికి చెందిన వ్యక్తి. గొల్లపల్లి నుంచి సూపర్ ఎక్స్‌ఎల్‌లో వస్తుండగా ఎదురుగా వస్తున్న కారును తప్పించపోయి ముందుచక్రం స్కిడ్ అయి కిందపడి తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. లక్కిరెడ్డిపల్లి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ మజీద్ బాషా గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

మనస్థాపంతో రేషన్ డీలర్ మృతి

సంబేపల్లె : ఎస్.సోమవరం గ్రామం దేవళంపేటకు చెందిన నాయబ్ అమీర్‌బాషా (59) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. కొన్ని దశాబ్దాలుగా దేవళంపేటలో రేషన్ డీలర్‌గా ఉన్నాడు. ఎన్నికలలో వైఎస్ఆర్‌సీపీకి మద్దతుగా ఉన్నాడని, అధికార పార్టీ నాయకులు అమీర్‌పై కక్షసాధింపుగా రేషన్ షాపును ఇటీవల తొలగించారు. ఈ విషయమై అమీర్ బాషా ఆవేదనకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలోనే అతను బుధవారం గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు వాపోతున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



ఆరంజ్ బస్సుకు జరిమానా విధిస్తున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : వాహనదారులు రవాణాశాఖ నిబంధనలు పాటించకపోతే చర్యలు రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ హెచ్చరించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, రవాణా శాఖలు సంయుక్తంగా కలిసి కడప–రేణిగుంట జాతీయ రహదారిలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఉండాల్సిన అనుమతులు తప్పనసరిగా కలిగి ఉండాలన్నారు. తనిఖీలలో భాగంగా వాహనాలకు సంబంధించి అన్ని అనుమతులను చూపించాలన్నారు. ట్యాక్స్, పర్మిట్ తోపాటు లైసెన్స్‌లపై దృష్టి సారించామన్నారు. వాహనదారులు ప్రమాదనివారణ చర్యలు పాటించాలన్నారు. ఆటోలలో అధికంగా జనాలను తీసుకొని ప్రయాణిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో నిబంధనలు పాటించని ఆర్‌ంజ్ బస్‌తోపాటు పలు వాహనాలకు రూ.7,73,000ల జరిమానా విధించామన్నారు. వాహనాలు రోడ్డెక్కటప్పుడు అన్ని అనుమతులు సక్రమంగా ఉంచుకోవాల్సిన బాధ్యత వాహన యజమానులదేనన్నారు. కార్యక్రమంలో డీఎం గుండాల రమణయ్య, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాడి కారకులపై కఠినంగా వ్యవహరించాలి



దాడిలో గాయపడ్డ దళితులను పరామర్శిస్తున్న బీకేఎంయూ నాయకులు

ఓబులవారిపల్లె : పెద్దఓరంపాడు పంచాయతీ పెరుమాళ్లపల్లి దళితవాడ గ్రామస్తులు భూ కబ్జాను అడ్డుకోవడంతో అగ్రవర్ణాలు దాడి చేయడం అమానుషమని బీకేఎంయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి పేర్కొన్నారు. బుధవారం అగ్రవర్ణాల దాడిలో గాయపడ్డ వారిని బీకేఎంయూ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా పండుగోల మణి మాట్లాడుతూ దశాబ్దాలుగా దళితవాడ గ్రామస్తులు మొక్కలను తొలగించి చదును చేసుకుంటూ వస్తున్న భూమిని అక్రమ ఆన్‌లైన్ ద్వారా అగ్రవర్ణాల వారు కబ్జాకు పాల్పడి వారిపై విచక్షణా రహితంగా దాడులు చేయడం దారుణమన్నారు. జిల్లా ఎస్పీ ఈ విషయంపై స్పందించి కఠినంగా వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉండి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సంఘటన జరిగి మూడు రోజులైనా రైల్వేకోడూరు శాసనసభ్యులు బాధితులను పరామర్శించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు బీకేఎంయూ నాయకులు ఎం.జయరామయ్య, మల్లిక, రమణయ్య పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి నైతిక విలువలు పాటించాలి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మానవత సేవా సంస్థ సభ్యులు

రాయచోటి టౌన్ : విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుతోపాటు నైతిక విలువలు పాటించాలని మానవత సేవా సంస్థ అధ్యక్షులు గాండ్లపెంట ఖాదర్ బాషా అన్నారు. బుధవారం మాసాపేట జెడ్పీహెచ్‌ఎస్‌లో మానవత ఆధ్వర్యంలో సమాజం పట్ల విద్యార్థుల బాధ్యత, నైతిక విలువలు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించిన ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలతోపాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని అలాగే సమాజంపై అవగాహన కలిగి ఉండటంతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జానకీ, సంస్థ సెక్రటరీ ఏ.జయచంద్రారెడ్డి, చైర్మన్ ఏ.శివగంగిరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, వెంకటరమణ, డైరెక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాణించడం గర్వకారణం



సత్కారం అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయురాలు

నందలూరు : ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థులు రాణించడంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లబోయిన గౌరీ కృషి ఎంతో ఉందని ఎంఈఓ నాగయ్య, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం జయలలితకుమారిలు కొనియాడారు. బుధవారం పాఠశాలలో ఆమెను వారు ఉపాధ్యాయులతో కలసి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికవ్వడం గర్వకారణమన్నారు. జిల్లాస్థాయి జరిగిన షాట్‌పుట్, యోగా, కబడ్డీ తదితర క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేయగా, వ్యాయామ ఉపాధ్యాయురాలిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఖాదర్ బాషా, నాగేంద్ర ప్రసాద్, శిల్పి ఆనందాచారి, గంగనపల్లి వెంకటరమణ, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, రవిశంకర్ రెడ్డి, విజయకుమారి, తులసీ స్వర్ణలత, జ్యోతి ప్రియ, ఎంవీ రమణమ్మ, మస్తాన్, రమణమ్మ, గొంటుముక్కల వెంకటరమణ, బోగా వెంకటసుబ్బయ్య, జివి ప్రసాద్, పాలేటి సుబ్బరాయుడు, ప్రమీల రేచల్, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు



సంబేపల్లె: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



నందలూరు : సత్తా చాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పావని, 9వ తరగతి చదువుతున్న గంగాదేవిలు రాష్ట్రస్థాయి కబడ్డీకి ఎంపికైనట్లు పీడీ అమరనాథరెడ్డి తెలిపారు. ఈ నెల 22వ తేదీన కడపలో జరిగిన కబడ్డీ అండర్–14 పోటీలలో ప్రతిభచూపడంతో అన్నమయ్య జిల్లా కేంద్రంలో ఈ నెల 27వ తేదీ జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 కబడ్డీ పోటీలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపిక కావడంతో పాఠశాల సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు పూలే విద్యార్థినులు


నందలూరు : ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో జరిగినటువంటి ఆటల పోటీలలో మహాత్మ జ్యోతిరావు పూలే సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారని ప్రిన్సిపల్ నాగేశ్వరీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ అండర్–19 విభాగంలో జరిగిన రెండు వందల మీటర్ల పరుగు పందెంలో పి.వర్షిత, 1500 మీటర్ల పరుగు పందెంలో హేమలత, ఫోర్ కే పరుగు పందెంలో కె.ఆశ, డిస్క్ త్రోలో ఎస్.నిత్య, జావెలిన్ త్రోలో ఎం.యోగ ప్రభలు ఎంపికయ్యారు. అలానే షాట్‌పుట్, క్రికెట్, హ్యాండ్ బాల్, చెస్, త్రో బాల్, టెన్నీకాయిట్, వాలీబాల్, కబడ్డీ, క్యారమ్స్‌లో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు రాణించేందుకు వ్యాయామ ఉపాధ్యాయురాలు సునీత కృషి ఎంతో ఉందని ప్రిన్సిపల్ నాగేశ్వరీ కొనియాడారు.



రాజేంద్ర

రాయచోటి (జగదాంబసెంటర్) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడప మున్సిపల్ స్టేడియంలో ఈనెల 22వ తేదీన జరిగిన అండర్–17 క్రికెట్ విభాగంలో జాండ్రపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న డి.రాజేంద్ర ఎన్నికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తెలిపారు. మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు రాజేంద్ర ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది అతనితోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు చక్రపాణిని అభినందించారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



హోమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని అరుంధతి కాలనీలో బుధవారం మాతమ్మ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్యనిర్వాహకులు చెంచుగార్ల పుల్లయ్య, ఆయన సతీమణి పాలకొండమ్మల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు మొదటిరోజు అట్టహాసంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో తొలిరోజు అర్చకులు ఏలేశ్వరం బాలు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెంచుగార్ల వెంకటసుబ్బయ్య, సిద్దిగొల్ల వెంకటసుబ్బయ్య, కడప నాగయ్య, చెంచుగార్ల రమణయ్య, పకిరుపల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలి

ఒంటిమిట్ట : ప్రజారక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ అన్నారు. పోలీసు అమరవీరు సంస్మరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని కొత్త మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతోపాటు పోలీసు అమరవీరుల త్యాగాలు గురించి తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.